క్లుప్తంగా

దేశాంబకు శ్రావణ పౌర్ణమి పూజలు



మంచాల (చేబ్రోలు): మండలంలోని మంచాల గ్రామ దేవత దేశాంబకు శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ 32వ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూర్ణచంద్ర శ్రీనివాసమూర్తి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



పొన్నూరు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు కోరారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసినట్లు చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థలు, వ్యాపార వర్గాలు సహకరించాలని కోరారు. సమావేశంలో జంగా రాజేష్ బాబు, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పరీక్షలపై కాషాయ ముద్ర

– కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను యూపీఎస్సీ నుంచి కాకుండా ఆర్ఎస్ఎస్ ద్వారా చేపట్టారని పొన్నూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత దశాబ్ద కాలంగా జరిగిన అన్ని నియామకాలపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ఉందని విమర్శించారు. అన్ని కేంద్ర ప్రభుత్వ పరీక్షలలో చేపట్టిన నియామకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామ అడ్డరోడ్డు సమీపంలో పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహిత, రెండు వేళ్లు చీకిపోయి, చర్మం, ముఖమంతా పాడైపోయి గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభావంతుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. సోమవారం రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారని అన్నారు. చిన్నతనంలోనే గుర్తించడం ద్వారా అంగ వైకల్యం రాకుండా తగు చర్యలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. విద్య, వృత్తిపరమైన శిక్షణ, పునరావాసం, సామాజికంగా కలిసి పోయే విధంగా చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు శ్రీధర్, భారతి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

నెహ్రూ నగర్: దేశంలో మహిళలకు రక్షణ చట్టాలు కల్పించడంతో పాటు మహిళలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వార్డు సచివాలయం, ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జాహ్నవి విజ్ఞప్తి చేశారు. కోల్‌కతాలో లైంగిక దాడికి గురైన మెడికల్ విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ దేశంలో కులమతాలకు అతీతంగా కుటుంబంలోని మగ బిడ్డలకు విలువలు నేర్పే దిశగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. పాఠ్యపుస్తకాలు స్థాయిలోనే ఆడపిల్లలకు గౌరవం కల్పించే అంశాలపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజ్ కుమార్, రాజ కుమారి, అహర్ని, కవిత పాల్గొన్నారు.

ప్రబలుతున్న విష జ్వరాలు

- ఆసుపత్రులకు జ్వరపీడితులు
- వీధుల్లో ఎక్కడా చూసినా అపరిశుభ్రత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



చేబ్రోలులో రోడ్డు పక్కన చెత్తాచెదారం



వడ్లమూడి అడ్డరోడ్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



చేబ్రోలులో దేవాలయం సమీపంలో చెత్తాచెదరంతో నిల్వ ఉండటంతో అపరిశుభ్రత

చేబ్రోలు: వీధుల్లో అపరిశుభ్రత, వాతవరణంలో చోటు చేసుకున్న మార్పులతో గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. మండలంలోని చేబ్రోలు, వేజండ్ల పీహెచ్‌సీల పరిధిలో గత కొద్ది రోజులుగా జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉంది. వడ్లమూడి గ్రామ పరిధిలోని గౌడపాలెం, గరువుపాలెం, అన్నపూర్ణమ్మ కాలనీల్లో విషజ్వరాలు అధికంగా ఉండటంతో వైద్యాధికారులు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. చేబ్రోలు, నారాకోడూరు గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయి. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, అనుమానితులను పీహెచ్‌సీకి రిఫర్ చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకం తెనాలి, గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన తాతయ్య, టి కృష్ణకుమారి జ్వరాల బారిన పడి మృతి చెందటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నారాకోడూరు గ్రామంలో ఇటీవల డెంగీ వ్యాధి లక్షణాలతో వ్యక్తి మృతి చెందాడు. యడ్లపాటి నగర్‌కు చెందిన వృద్ధుడు విష జ్వరంతో మరణించాడు. అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లిన రోగులకు వివిధ కారణాలతో వేలాది రూపాయిలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. వీధులలోని అపరిశుభ్రతపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

చేబ్రోలు, వడ్లమూడి, నారా కోడూరు, వేజండ్ల తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. సైడ్ డ్రెయిన్‌లు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయింది. దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వడ్లమూడి గౌడ పాలెంలోని పలు పల్లపు ప్రదేశాలలో వర్షపునీరు, మురుగునీరు నిలిచి ఉండటమే వ్యాధుల ప్రబలటానికి కారణమని చెబుతున్నారు. అన్నపూర్ణమ్మ కాలనీ, అడ్డరోడ్డు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య దుర్గంధం వెద జల్లుతోంది. ప్రధాన రహదారుల వెంట చెత్తాచెదారం వేయడంతో రాకపోకలు సాగించే వారు దుర్వాసనను భరించలేకపోతున్నారు.

డెంగీ కేసులు ఏమీ లేవు..

వేజండ్ల పీహెచ్‌సీ పరిధిలో డెంగీ వ్యాధి లక్షణాలు ఎక్కడా లేవని వైద్యాధికారి కె.బాబురావు తెలిపారు. వడ్లమూడి గ్రామంలో జ్వర పీడితులు కొంతమంది ఉన్నారన్నారు. వాతవరణంలో వచ్చిన మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలినట్లు వైద్యాధికారి తెలిపారు. గ్రామంలోని గౌడపాలెంలో మెడికల్ క్యాంపును కొద్ది రోజుల పాటు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందన్నారు. డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి తదితరులు వడ్లమూడి గ్రామాన్ని పరిశీలించి, అధికారులు పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్యం అధ్వానం



గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కొద్ది రోజులుగా మహిళలు, యువకులు, వృద్ధులు ప్రతి ఒక్కరూ జ్వరాల బారిన పడుతున్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళితే చికిత్స కోసం వేలాది రూపాయిలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

– తలకాల మస్తాన్, వడ్లమూడి

ఎక్కడ మురుగు అక్కడే



వడ్లమూడి గ్రామంలో సైడ్ డ్రెయిన్‌లు సక్రమంగా లేవు. ఎక్కడ మురుగు అక్కడే నిలిచి ఉంది. వర్షాలు కురిసినప్పుడు సమస్య మరింత జటిలమవుతుంది. అన్నపూర్ణమ్మ కాలనీ, గౌడపాలెంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

– కంచర్ల మాణిక్యం, అన్నపూర్ణమ్మ కాలనీ, వడ్లమూడి

త్రిపుల్ ఐటీ విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో ఏహెచ్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు

చేబ్రోలు: మండలంలోని నారా కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.చిత్రలేఖ పదో తరగతిలో 578 మార్కులతో మొదటి స్థానంలో నిలిచి, నూజివీడు ట్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందింది. సోమవారం విద్యార్థిని అభినందన కార్యక్రమం జరిగింది. సమావేశానికి హెచ్ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో ఏహెచ్‌వో ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల నుంచి ఏటా ట్రిబుల్ ఐటీలో విద్యార్థులు ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్ల ప్రతిభ గల విద్యార్థులకు మేలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని బి. చిత్రలేఖను శాలువా, మెమెంటోతో సత్కరించారు. నగదు బహుమతి అందజేశారు. 500 పైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను గణిత ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు బహూకరించారు. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మెరిట్ విద్యార్థుల కోసం రూ. 25 వేలు డిపాజిట్ చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలిసి సుమారు రూ. 20వేలు నగదును సబ్జెక్ట్ వారీగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వి.నాగ మల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, గౌరీ పాల్గొన్నారు.

ఆత్మీయతను పంచే రక్షా బంధన్



గుంటూరు ఎడ్యుకేషన్: సోదరీ, సోదరుల మధ్య ఆత్మీయతను పంచే రక్షా బంధన్ రక్త సంబంధానికి అతీతమైనదని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం రక్షా బంధన్ సందర్భంగా జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పొన్నూరు జెడ్పీటీసీ కర్లపూడి రమేష్‌కు రాఖీ కట్టారు. అక్కా తమ్ముడు, అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీక అని అన్నారు.

టీడీపీ కక్ష సాధింపు చర్యలు

20 ఏళ్లుగా కొనసాగుతున్న ఆశీలు లీజు రద్దు



పొన్నూరు: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే వారిపై టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పట్టణంలోని ఐదో వార్డు వైఎస్ఆర్ సీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్. గఫార్ ఆరోపించారు. సోమవారం టీడీపీ కారణంగా తనకు జరిగిన అన్యాయంపై విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లగా పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఆశీలును టెండర్ ప్రక్రియ ద్వారా లీజు దక్కించుకుని జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు. రాజకీయ వేధింపులలో భాగంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగుతున్న ఆశీలు లీజు ప్రక్రియను టీడీపీ అర్ధంతరంగా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో (20 ఏళ్లలో) ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ అధికారులు అభ్యంతరాలు సృష్టించి, లీజు రద్దు చేశారని అన్నారు. ఇటీవల లీజు ద్వారా కొనసాగుతున్న మున్సిపల్ కమిషనర్ కారును కూడా తొలగించారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో తనకు జరిగిన అన్యాయంపై విచారిస్తే ఎమ్మెల్యే ఆదేశాల మేరకే తొలగించడం జరిగిందని అధికారులు చెప్పడం ఆవేదన కలిగించిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పార్థీనియం మొక్కల నివారణ వారోత్సవాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గంగాదేవి తదితరులు

గుంటూరు రూరల్: పార్థీనియం (వయ్యారిభామ) కలుపు మొక్కల ద్వారా పంటలకే కాకుండా జీవరాశికి నష్టం కలుగుతుందని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి తెలిపారు. పార్థీనియం మొక్కల నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగర శివారులోని లాంఫాం నందున్న కేవీకే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం గృహ విజ్ఞాన కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్క అత్యంత ప్రమాదకరమైనదని తెలిపారు. ఈ మొక్కలు పూత రాక ముందే వేళ్లతో సహా పీకి తగల బెట్టాలన్నారు. జైగో్గ్రామబైకలరేట్ మందును పిచికారి చేయటం, లేదా అక్షింతల పురుగు కీటకం ద్వారా కూడా వీటిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ మొక్కల పుప్పొడి ద్వారా మనుషులకు చర్మ వ్యాధులు, ఆస్తమా, కాన్సర్ వంటి రోగాలు వస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో వయ్యారి భామ మొక్కలు పీకి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ బిలిక్విస్ విద్యార్థులు తదితరులు న్నారు.

మిరప విత్తనాలు కొని నష్టపోయాం

– ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మిర్చి రైతు ఆవేదన

ప్రత్తిపాడు: మిరప విత్తనాలలు కొని నష్టపోయామని ఓ రైతు తహసీల్దారు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని కోయవారిపాలెం గ్రామానికి చెందిన రైతు కొక్కెర గంగయ్య తన గోడును వెల్లబోసుకున్నాడు. గంగయ్య ఈ ఏడాది మిర్చి సాగు కోసం గుంటూరు బీఆర్ స్టేడియం రోడ్డులోని ఓ హైబ్రిడ్ సీడ్స్ డిపోలో చిల్లీ ఈలైట్ ప్రైమ్ అగ్రి పేరుతో 0824061 లాట్ నంబర్ కలిగిన పదకొండు ప్యాకెట్లను రూ.750 చొప్పున ఒక్కోటి కొనుగోలు చేశాడు. ప్యాకెట్లలోని విత్తనాలను బాపట్లలోని అన్నదాత నర్సరీ నందు నారు కోసం నాటాడు. విత్తనాలు సక్రమంగా మొలకెత్తలేదు. దీంతో విషయాన్ని సదరు దుకాణ యజమాని దృష్టికి తీసుకువెళ్లాడు. వారు సరైన సమాధానం చెప్పకుండా సుమారు నెల రోజులుగా గంగయ్య అతని తండ్రి నాగయ్యను ఇబ్బందులు పెడుతున్నారు. నికిలీ విత్తనాల ప్యాకెట్లపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని అర్జీలో పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించి విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులు తదితరాలను తహసీల్దారు కె. రవిబాబుకు అందజేశారు. స్పందించిన తహసీల్దార్ వ్యవసాయశాఖ అధికారులకు అర్జీని పంపి వెంటనే సమస్యను పరిష్కరించి రైతుకు న్యాయం చేయాలని ఆదేశించారు.

బొప్పాయి రైతులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: అన్నమయ్య జిల్లాలో నర్సరీల వారు నాణ్యతలేని బొప్పాయి విత్తనాలు తెచ్చి నాసిరకం నారును పెంచి రైతాంగాన్నికి అంటగట్టి మోసం చేసిన యాజమాన్యాల నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని, నర్సరీ యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసరావును కౌలు రైతు సంఘ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. నష్టపోయిన బొప్పాయి రైతులకు నాసిరకం నారు అమ్మిన నర్సరీ యాజమాన్యాలపై '2010 నర్సరీ చట్టం' ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఎకరానికి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం నర్సరీ యాజమాన్యాల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి



నెహ్రూ నగర్: మహిళలపై లైంగిక వేధింపులు బాధాకరమని సెయింట్ మాథ్యూస్ వెస్ట్ ప్యారిస్ చర్చి రెవరెండ్ పాస్టర్ సతీష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో పి.జి.మెడికల్ విద్యార్థినిపై లైంగిక దాడిని ఖండిస్తూ సోమవారం సెయింట్ మాథ్యూస్ వెస్ట్ ప్యారిస్ చర్చి నుండి హిందూ కాలేజ్ సిగ్నల్స్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మానవత దృక్పథంతో సమాజంలో జరిగే సంఘ విద్రోహ ఘటనలు ముఖ్యంగా మానవులపై జరిగే దాడులు విషయంలో ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దానిలో భాగంగానే పరిశుద్ధ మత్తయి లూథరన్ తూర్పు గురుమండలం దేవాలయం చర్చి కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్చ్.. మారింది పేరే..!



ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైన కొన్ని శాఖల అధికారులు

- 'మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నగం శాఖల అధికారులు డుమ్మా
- ప్రతీ సోమవారం ఇదే తంతు
- ప్రజా సమస్యలపై చిన్నచూపు

ప్రత్తిపాడు: గత ప్రభుత్వంలో స్పందన పేరుతో ఉన్న గ్రీవెన్స్ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఆర్భాటంగా పేరు మార్చింది. పాత సీసాలో కొత్త నీరు నింపినట్లు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' అంటూ పాత కార్యక్రమానికి కొత్త పేరు పెట్టింది. కానీ, అమలు చేయాల్సిన అధికారులు మాత్రం గతం కంటే నాస్తిగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమం పట్ల అంతులేని నిర్లక్ష్యాన్ని చాటుతూ కార్యక్రమానికి డుమ్మా కొట్టేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో సహా అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి. ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి తహసీల్దారు ఆయా శాఖల అధికారులకు అప్పగించడం, వారు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది. కానీ అనేక శాఖల అధికారులే కార్యక్రమానికి గైర్హాజరవుతున్నారు.

సగానికి పైగా శాఖలు డుమ్మా..

సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యాశాఖ, వైద్యశాఖ, దేవాదాయ, సెబ్, ఉపాధి హామీ, డ్రెయినేజీ, కార్మికశాఖ, అటవీశాఖ, వంకాలయపాడు మేజర్, విద్యుత్‌శాఖ అధికారులు డుమ్మా కొట్టేశారు. కాగా వ్యవసాయ శాఖ, వెటర్నరీ శాఖల అధికారులు కూల్‌గా పదకొండు గంటలకు హాజరు కాగా, విద్యాశాఖ, ఇరిగేషన్, వెలుగు శాఖలకు సంబంధించి మండల స్థాయి అధికారులు హాజరుకాకుండా ద్వితీయ శ్రేణి అధికారులను పంపి తమ దర్పాన్ని ప్రదర్శించారు. ఇదిలా ఉంటే హాజరైన వారిలోనూ సగం మంది గ్రీవెన్స్ సమయం ముగియకముందే వెళ్లిపోయారు. దీంతో వచ్చిన అర్జీలన్నింటికీ తహసీల్దారు ఒక్కరే స్వీకరించి, వాటిని ఆన్‌లైన్ చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు హాజరైతే పిర్యాదుదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే వెసులుబాటు ఉంటుంది.

నాలుగు 'సి'లతో విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు

ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ ఈదర



ప్రత్తిపాడు: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలంటే నాలుగు 'సి' లను అలవాటు చేసుకోవాలని ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ ఈదర అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవికిరణ్ ఈదర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సీల్లో మొదటిది విమర్శనాత్మక ధోరణి (క్రిటిసిజం), రెండవది కమ్యూనికేషన్ స్కిల్స్, మూడవది అందరూ కలిసి పనిచేయడం (కొలాబరేషన్), నాల్గవది మంచి కన్వర్జేషన్ ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులు నేటి యువత చాట్ జీపీటీని ఉపయోగించుకుంటూ అన్ని రకాల సమాచారాలని సెకండ్లలో తెలుసుకోవాలన్నారు. కేవలం పుస్తకాలలో పాఠ్యాంశాలలో ఉన్న సమాచారమే కాకుండా వాటితో పాటుగా బాహ్య ప్రపంచంలో జరుగుతున్న వాటిని ఎప్పటికప్పుడు అనుసరించాలని సూచించారు. జీవిత లక్ష్యాన్ని సాధించి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. అప్పారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, ఎస్అండ్‌హెచ్ హెచ్‌వోడీ డాక్టర్ ఎ. కృష్ణ చైతన్య, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డయేరియా నిర్మూలన

జల జీవన్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ తేజ్ సంగీత్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తేజ్ సంగీత్

పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే డయేరియాను నిర్మూలించగలమని జల జీవన మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.తేజ్ సంగీత్ అన్నారు. సోమవారం జల జీవన మిషన్ ఆధ్వర్యంలో వెల్లలూరు గ్రామంలో డయేరియా నిర్మూలనకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.రమేష్ అధ్యక్షతన డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్ సంగీత్ మాట్లాడుతూ భోజనం చేసే ముందు, మల విసర్జనకు అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, ఈగలు వాలిన ఆహార పదార్థాలను దూరం పెట్టాలని చెప్పారు. ప్రతిరోజు గోరు వెచ్చని నీటిని తాగడం ద్వారా జీర్ణక్రియ బాగా పనిచేస్తుందని పేర్కొన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

– ఏడీఏ వి.రామకోటేశ్వరి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రామకోటేశ్వరి, ఏఓ వెంకట్రామయ్య

పొన్నూరు: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వి.రామ కోటేశ్వరి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలలో ఏవో వెంకటరామయ్యతో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. విక్రయాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. మండలంలోని డీసీఎంఎస్, నిడుబ్రోలు, పీటీ పరువు, దుప్పలపూడి, మునిపల్లి, చింతలపూడి, పెదపాలెం, భారతి నగర్ సొసైటీల్లో కూడా డీఏపీ, కాంప్లెక్స్ యూరియా అందుబాటులో ఉన్నాయని ఏడీఏ వెల్లడించారు. రైతులు సరిపడా ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

ఎస్పీని కలిసిన ఏపీ రిటైర్డ్ పోలీస్ అధికారులు



జిల్లా ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ(రిటైర్డ్ ఏఎస్పీ), కోశాధికారి కె.వి.నారాయణ, కార్యవర్గ సభ్యులు బీవీ సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిచారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం నిర్వహించిన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారంపై జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు.